ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 27 ఫిబ్రవరి 2024



"యువతకు ఉద్యోగం రావాలన్నా.. మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా.. టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాలి. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తాం. యువత రోడ్డుపైకి వచ్చి సైకిల్ ఎక్కి జెండా పట్టుకుని ప్రచారం చేయాలి. గ్లాసు పట్టుకుని నీరు తాగాలి. ఇంట్లో కూర్చోకుండా బాధ్యతగా యువ ఓటర్లు ఓటు వేయాలి. మీ ఓటుతో కలియుగ భస్మాసురుడు.. జగన్‌ను ఓడించేందుకు సిద్ధంగా ఉండాలి."

- రా..కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపు



మీ భవిష్యత్తు బావుండాలంటే.. టీడీపీ-జనసేన రావాలి

సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు, హాజరైన అభిమానులు, టీడీపీ-జనసేన శ్రేణులు

- యువత రోడ్డుపైకి వచ్చి సైకిల్ ఎక్కి జెండా పట్టుకోండి
- యువ ఓటర్లు బాధ్యతగా ఓటు వేయాలి
- మూలపాడు పోర్టును భావనపాడుగా మార్చి విస్తరిస్తాం
- టెక్కలిలో మెడికల్ కళాశాల నిర్మిస్తాం
- మత్స్యకారులకు ఎమ్మెల్సీ ఇస్తాం
- వంశధార-నాగావళి నదులను అనుసంధానం చేస్తాం
- 'రా కదలిరా' సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'మీ భవిష్యత్ కోసం టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాలి. కూటమిగా ఏర్పడింది అందుకోసమే' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సోమవారం శ్రీకాకుళం ఎనభై అడుగుల రోడ్డులో నిర్వహించిన 'రా కదలిరా' సభలో ఆయన పాల్గొని వైసీపీ పాలనపై ధ్వజమెత్తారు. జిల్లాలో వైసీపీ ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతిని తూర్పారబట్టారు. టీడీపీ- జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి పనులను వివరించారు. "తెలుగుదేశం పార్టీకి శ్రీకాకుళం జిల్లా కంచుకోట. పార్టీ ఆవిర్భావం నుంచి ఆదరిస్తున్న జనం.. మళ్లీ ఆదరిస్తారని నమ్ముతున్నా. నా మనసుకు ఎంతో దగ్గరైన ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ ఎర్ర న్నాయుడు సొంత జిల్లా ఇది. బీసీ సింహం ఎర్రన్నాయుడిని స్మరించుకుంటూ సభను మొదలు పెడదాం. వైసీపీ అరాచక పాలనలో అచ్చెన్నాయుడిని ఎలా అరెస్ట్ చేశారో చూశాం. కళా వెంకటరావుపై తప్పుడు కేసులు పెట్టారు. రాక్షస పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం. రాష్ట్ర విభజన కంటే జగన్ రెడ్డి విధ్వంస పాలన వల్లే ఏపీ ఎక్కువ నష్టపోయింది. జగన్ పని ఇక అయిపోయింది. వైసీపీ చిత్తుచిత్తుగా ఓడుతుంది. ప్రజలు ఆమోదించిన వారికే సీట్లు ఇవ్వాలనే కొత్త విధానానికి శ్రీకారం చుట్టి.. మీ అందరికీ ఫోన్లు చేశాను. మీరు కోరుకున్న వ్యక్తికే సీటు ఇస్తాం. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించి.. వైసీపీని సాగనంపాలి" అని చంద్రబాబు కోరారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొండు శంకర్



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చంద్రబాబునాయుడు



వేదికపై టీడీపీ, జనసేన జెండాలు ఊపుతూ.. ఉత్సాహం నింపుతున్న చంద్రబాబు

ఒక్క అవకాశంతో బతుకులు చిన్నాభిన్నం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం అర్బన్, ఫిబ్రవరి 25: పాదయాత్రలో ఒక్క అవకాశం అంటూ అభ్యర్థించి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ రెడ్డి.. రాష్ట్ర ప్రజల బతుకులను చిన్నాభిన్నం చేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. 'వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలనపై రాష్ట్ర ప్రజలందరిలోనూ వ్యతిరేకత ఉంది. టీడీపీ-జనసేన పొత్తు కుదిరినప్పుడే జగన్‌లో వణుకు మొదలైంది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు జగన్‌కు లేదు. ఇటీవల చంద్రబాబునాయుడు అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతో వైసీపీ ఎమ్మెల్యేలు తట్టాబుట్టా సర్దేశారు. సర్వేలు కూడా టీడీపీ-జనసేన కూటమికి పాజిటివ్‌గా ఉండడంతో వైసీపీకి అభ్యర్థులు కరువయ్యారు. రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు వైసీపీ నాయకులు కులాలు, మతాల వారీ చిచ్చు పెట్టేందుకు యత్నిస్తున్నారు. పాత్రికేయులు, పత్రికా కార్యాలయాలపై దాడులు చేస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు. టీడీపీ హయాంలో వంశధార పనులు 75శాతం పూర్తిచేయగా.. వైసీపీ ఒక్క శాతం కూడా పనులు చేపట్టలేదు. గతంలో వంశధార-బాహుదా నదుల అనుసంధానానికి అప్పటి సీఎం చంద్రబాబు రూ.6వేల కోట్లతో టెండర్లు పిలిచారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టెండర్లు రద్దు చేశారు. జిల్లాలో చేతకాని వైసీపీ ప్రజాప్రతినిధులు ఉన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఓటు అనే ఆయుధంతో వైసీపీకి బుద్ధి చెప్పాల'ని అచ్చెన్న కోరారు.



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

జనసంద్రమైన శ్రీకాకుళం

టీడీపీ అధినేత చంద్రబాబు రాకతో శ్రీకాకుళం జనసంద్రమైంది. అన్ని నియోజకవర్గాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. మహిళలు సైతం అధిక సంఖ్యలో జెండాలు పట్టుకుని.. వలంటీర్ల ఆంక్షలు దాటుకుని సభకు రావడం విశేషం. సోమ వారం సాయంత్రం 4.34 గంటలకు సభ వద్దకు చంద్రబాబు చేరుకున్నారు. 5.16 గంటల నుంచి 6.18 గంటల వరకు ప్రసంగించారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడిని ప్రత్యేకంగా అభినందించి.. పులి బిడ్డ.. పులిబిడ్డే అంటూ కొనియాడారు. వైసీపీ నాయకులు అవినీతిలో ముందువరుసలో ఉంటే.. టీడీపీ నాయకులు ప్రజలకు మంచి చేసే విషయంలో ముందున్నారని కీర్తించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గజమాలతో చంద్రబాబును సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ మంత్రులు కిమిడి కళావెంకటరావు, గుండ అప్పలసూర్య నారాయణ, కోండ్రు మురళీ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యే లు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, బగ్గు లక్ష్మణరావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, చౌదరి నారాయణమూర్తి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్, పొందూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జనసేన నాయకులు దానేటి శ్రీధర్, పిసిని చంద్రమోహన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిక్కోలును దోచుకుంటున్న వైసీపీ ఎమ్మెల్యేలు..

'శ్రీకాకుళాన్ని మంత్రి ధర్మాన ప్రసాదరావు.. ప్రసాదంలా ఆరగిస్తున్నాడు. ఇసుక ర్యాంపు వ్యవహారాలను కొడుకు చేతిలో పెట్టి ఆర్జిస్తున్నాడు. సావిత్రీపురంలో 67 ఎకరాల్లో భారీ లే అవుట్లు వేశాడు. అందులో 23ఎకరాలు ప్రభుత్వ భూములు. సెంటు పట్టాల్లో కూడా అవినీతికి పాల్పడ్డాడు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు గుంతలమయంగా ఉంది. ఇప్పటివరకు 27 మంది చనిపోయారు. సంపాదనపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు. జగన్‌కు భజనదాసుగా నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు వ్యవహరిస్తున్నాడు. స్టోన్‌క్రషర్ కోసం పది ఎకరాల భూమిని తోటాడలో కొట్టేశాడు. పాతపట్నంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పీఏలే కలెక్షన్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. పలాసలో మంత్రి అప్పలరాజు తప్పులరాజుగా వ్యవహరిస్తూ కొండల్ని మింగేస్తున్నాడు. ఇక్కడి అక్రమాలను ప్రశ్నించినందుకు.. గౌతు శిరీషపై కేసులు పెట్టారు. స్పీకర్ తమ్మినేని సీతారాం.. అక్రమార్జనం కోసం జనంపైకి కొడుకుని, భార్యను వదిలాడు. నాగావళి-వంశధార నుంచి లారీ ఇసుకకు రూ.6వేలు కప్పం చెల్లించాలి. కొంతమందిని బెదిరించి రూ.4.2కోట్ల విలువైన భూమిని తీసుకున్నాడు. సొంత కళాశాల కోసం నాలుగు ప్రైవేటు కాలేజీలను మూయించాడు. ఇక టెక్కలి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. అచ్చెన్నాయుడిని ఓడిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నాడు. పోర్టులో ఉద్యోగాలిస్తామంటూ జనం నుంచి డబ్బులు గుంజుతున్నాడు. సీఎం జగన్ కూడా గుర్తించి.. నీకంటే నీ భార్యే బెటర్ అని దువ్వాడను పొమ్మన్నాడు. వీళ్ల ప్రజాప్రతినిధులా..?'అంటూ చంద్రబాబు ధ్వజమెత్తారు.

అధికారంలోకి వస్తే.. చేసే మేలు ఇదే

వంశధార-నాగావళి నదులు అనుసంధానం చేస్తాం. జీడిపిక్క రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. పలాసలో డిఫెన్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. నరసన్నపేట పరిధిలోని బొంతు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిచేస్తాం. వంశధార-బహుదా నదులను అనుసంధానం చేసి ఆరు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తాం. పలాస-కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్‌ను పూర్తి చేస్తాం. ఉద్దానం కిడ్నీ సమస్యకు పరిష్కారం చూపించాం. 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పూర్తి చేస్తాం. తొలిసారిగా కిడ్నీ రోగులకు రూ. 2500 చొప్పున పింఛన్ ఇచ్చిన ఘనత టీడీపీదే. ఎన్టీఆర్ సుజల పథకం కింద ఇచ్ఛాపురం, పలాసలో 167 మినీప్లాంట్లను ఏర్పాటు చేశాం. మూలపేట పోర్టును భావనపాడు పోర్టుగా మార్చి పెద్ద పోర్టుగా చేసి ఉద్యోగాలు ఇస్తాం. విశాఖ నుంచి భావనపాడు వరకు సముద్రం పక్కన రోడ్లను నిర్మిస్తే పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటై పర్యాటక రంగ అభివృద్ధి చెందుతుంది. మత్స్యకారుల కోసం జెట్టీ నిర్మిస్తాం. మత్స్యకారులకు ఎమ్మెల్సీ పదవి ఇస్తాం. కళింగ వైశ్యులను బీసీ-డీగా చేశాం. వారిని ఓబీసీలుగా గుర్తించే బాధ్యత కూడా తీసుకుంటాం. టెక్కలిలో మెడికల్ కాలేజీని నిర్మిస్తాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.



వేదిక ఆవరణలో చెట్టు ఎక్కి.. చంద్రబాబు సభను వీక్షిస్తున్న అభిమానులు



టీడీపీ, జనసేన జెండాలతో అభిమాని..



అభిమానుల విజయ సంకేతం

పట్టపగలే కానిచ్చేశారు

- కాశీబుగ్గలో వ్యాపారి ఇంట్లో భారీ చోరీ
- తలుపులు పగులగొట్టి.. బీరువాలు తెరిచి..
- రూ.10 లక్షల నగదు, 15 తులాల బంగారం, 3 కిలోల వెండి అపహరణ

పలాస, ఫిబ్రవరి 26: కాశీబుగ్గ పోతనపల్లి వీధిలో సోమవారం ఉదయం ఓ వ్యాపారి ఇంట్లో దొంగలు అలజడి సృష్టించారు. ఎవరూలేని సమయంలో ఇంటి తలుపులు పగలుగొట్టి బెడ్‌రూములో ఉన్న బీరువాలు తెరిచారు. అందులో రూ.10లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండిని తస్కరించి పరారీ అయ్యారు. దీనికి సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్ వద్ద కిరాణా షాపు నిర్వహిస్తున్న కొత్తకోట రామ కుటుంబం పోతనపల్లివీధిలో నివాసం ఉంటోంది. సమీపంలో సొంత ఇంటిని వారు నిర్మించడం కోసం ప్రైవేట్ చిట్‌ఫండ్ నుంచి రూ.10లక్షలు తెచ్చి బీరువాలో దాచారు. సోమవారం ఉదయం 11గంటలకు కొత్తకోట రామతో పాటు ఆయన కుమారుడు వ్యాపారం నిమిత్తం కిరాణాషాపునకు వెళ్లిపోయారు. మరో కుమారుడు, భార్య సమీపంలో కొత్త ఇంటి నిర్మాణ పనులు పర్యవేక్షించేందుకు ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. 12 గంటల సమయంలో రామ కుమారుడు కె.లోచన్ ఇంటికి రాగా తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. బీరువా తెరిచి సామగ్రి అంతా చెల్లాచెదురుగా పడిఉండడంతో దొంగతనం జరిగిందనే అనుమానంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. వారు వచ్చి బీరువాలో ఉన్న రూ.10లక్షల నగదు, 15తులాల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి సామగ్రి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బాధితుడు రామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాశీబుగ్గ పోలీసులు, క్రైమ్ పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కొద్దిరోజుల కిందట కాశీబుగ్గ తిలక్‌నగర్ కాలనీలో పెళ్లికార్డు తీసుకోండని చెప్పి ఇద్దరు ఆగంతకులు ఇంట్లో చొరబడి మహిళపై పిడిగుద్దులు కురిపించి రూ.1.50 లక్షల నగదు అపహరించిన విషయం విదితమే. ప్రస్తుతం పోతనపల్లి వీధిలో కూడా పట్టపగలే దొంగలు ఇంటిలో చొరబడి నగదు, బంగారం, వెండిని చోరీ చేయడం పలాస-కాశీబుగ్గ జంట పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న క్రైమ్ పోలీసులు

'అమృత్ భారత్'తో రైల్వేస్టేషన్లకు మహర్దశ

- వర్చువల్ విధానంలో పీఎం మోదీ శంకుస్థాపనలు
- నిధులు మంజూరు హర్షణీయం: ఎంపీ రామ్మోహన్

ఆమదాలవలస/ ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 26: అమృత్ భారత్ పేరిట దేశంలో ఒకేసారి 554 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేపట్టడం గిన్నీస్ రికార్డు అంశమేనని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ పథకం ద్వారా రైల్వేస్టేషన్లకు మహర్దశ పట్టనుందని స్పష్టం చేశారు. సోమవారం శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన ప్రధానమంత్రి మోదీ వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 'అమృత్ భారత్ కింద జిల్లాలో మూడు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం అభినందనీయం. ఒకప్పుడు రాష్ట్రాల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం రైల్వే అభివృద్ధి పనులు చేపట్టేది. ప్రస్తుతం పీఎం మోదీ ఆ విధానానికి స్వస్తి పలికి ఒకేసారి రూ.41వేల కోట్లతో చిరస్థాయిగా నిలిచే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీకాకుళంరోడ్డు రైల్వేస్టేషన్ భవన నిర్మాణంతోపాటు ఊసవానిపేట రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి సుమారు రూ.25కోట్లు, నౌపడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.18కోట్లు మంజూరయ్యాయి' అని తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని వెల్లడించారు. అలాగే దూసి సమీపంలో రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.70కోట్లు మంజూరయ్యాయి. అక్కడ చీఫ్ ఇంజనీర్ వి.సాయిరాజ్ ఆధ్వర్యంలో వర్చువల్ శంకుస్థాపన చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

- ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.17.98కోట్లు మంజూరు చేయడం శుభ పరిణామమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. ఇచ్ఛాపురంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఇచ్ఛాపురం స్టేషన్‌లో ప్రధాన రైళ్లు పూరీ-అహ్మదాబాద్, హౌరా-యశ్వంత్‌పూర్ నిలుపుదల చేయాలి. రెండు అండర్ పాసేజ్‌లు పునరుద్ధరించాలి. ఆటోలు నిలిపేందుకు డ్రైవర్లకు స్థలం కేటాయించాల'ని ఈస్ట్‌కోస్ట్ రైల్వే చీఫ్ ఇంజనీర్ చంద్రమోహన్‌ను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఏడీఆర్ఎం గుప్తా, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిర్మలారెడ్డి, కట్టా సూర్యప్రకాష్, ఏఈ రస్మిరంజన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

నరసన్నపేట: మండలంలో దేవాది, ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ పంపు సెట్లకు ప్రత్యేక లైన్లు వేస్తున్న నేపథ్యంలో మంగళవారం నుంచి 29వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల కోమర్తి, యారబాడు, లింగాలపాడు, వీఎన్‌పురం, గోకయ్యవలస, చింతువానిపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగ దారులు గమనించాలన్నారు. అలాగే వ్యవసాయ పంపు సెట్లకు తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 10 గంటలు వరకు విద్యుత్ సరఫరా చేయనున్నామేఇ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చంద్రబాబును కలిసిన జడ్పీటీసీ



చంద్రబాబును కలుసుకున్న జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు

హిరమండలం: శ్రీకాకుళంలో సోమవారం జరిగిన రా..కదలిరా బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉత్తరాంధ్రలో ఏకైక టీడీపీ జడ్పీటీసీ అయిన బుచ్చిబాబుకు సభా వేదిక పైకి ప్రత్యేక ఆహ్వానం అందింది.

విజయానికి సమష్టి కృషి

వజ్రపుకొత్తూరు: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయానికి సమష్టిగా కలిసి పనిచేద్దామని డోకులపాడు మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ అన్నారు. సోమవారం గ్రామంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని కోరారు.

జిల్లాస్థాయి వాలీబాల్ విజేత శ్రీకాకుళం

వజ్రపుకొత్తూరు: బాతుపురంలో రెండు రోజులుగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా శ్రీకాకుళం సచిన్ స్పోర్ట్స్ జట్టు నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా యువతరం ఆర్ట్స్ పూండి, బాతుపురం జట్లు నిలిచాయి. నాలుగో స్థానాన్ని కంచిలి జట్టు దక్కించుకుంది. విజేతలకు షీల్డ్‌తో పాటు నగదు పురస్కారాన్ని మంత్రి అప్పలరాజు అందించారు. సర్పంచ్ బత్తిన సృజన, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి

నరసన్నపేట: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీటీ ఆర్. రామారావు అన్నారు. సోమవారం స్థానిక ఇందిరానగర్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహనకు ర్యాలీ చేపట్టారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ఓటును అమ్ముకోకుండా సక్రమ మార్గంలో వినియోగించుకోవాలని కోరారు.

నీలవేణి ఆశయాలను కొనసాగించాలి

పలాసరూరల్: పీవోడబ్ల్యూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు నీలవేణి ఆశయాలను కొనసాగించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు బతకల ఈశ్వరమ్మ అన్నారు. నీలావతి గ్రామంలో జుత్తు నీలవేణి ఇటీవల కిడ్నీవ్యాధితో బాధపడుతూ మృతి చెందడంతో సోమవారం సంతాప సభ నిర్వహించారు. నీలవేణి కుటుంబం రైతాంగ విప్లవోద్యమంలో ఎన్నో త్యాగాలు చేసిందని, ఈమె కూడా బడుగువర్గాల సమస్యల పరిష్కారానికి పాటుపడిందన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు, కార్యదర్శి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం

పాతపట్నం: మారుమూల గిరిజనుల సంక్షేమమే వేదవాహిని ప్రాజెక్ట్ లక్ష్యమని బ్రెడ్స్ సంస్థ అధ్యక్షుడు వేమకోటి సాంబమూర్తి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమన్వయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, సారవకోట మండ లాల్లోని మారుమూల గిరిజనులకు సేవలందించనున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జేవీ రమణ, ఎంపీడీవో వెంకన్నబాబు, ఈవోపీఆర్డీ కృష్ణారావు, ఎంఈవో బి.శ్రీధర్, ఉపాధి ఏపీవో సురేష్ పాల్గొన్నారు.

నౌగాం పీహెచ్‌సీ ప్రారంభం

నందిగాం: నౌగాంలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీని సోమవారం ప్రారంభించారు. ఇక్కడ పీహెచ్‌సీ సిబ్బంది సబ్ సెంటర్‌లో విధులు నిర్వహించి ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు నూతన భవనాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, జిల్లా వైసీపీ సమన్వయకర్త పేడాడ తిలక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, అదనపు డీఎంహెచ్‌వో ఎం.ప్రసాద రావు, డీఈఈ రవికాంత్, డాక్టర్ డి.అంజలి పాల్గొన్నారు.

నేడు ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు దేవదాయ శాఖ సిబ్బంది సమక్షంలో హుండీలను లెక్కించనున్నామన్నారు.

రైల్వే జంక్షన్ సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి: అమృత్ భారత్ రైల్వేస్టేషన్ కింద ఎంపికైన నౌపడా రైల్వే జంక్షన్‌లో మౌలిక వసతులు కల్పించాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం నౌపడా రైల్వే స్టేషన్‌లో వాల్తేరు డివిజన్ సీతఈ ఆర్ఎం సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నౌపడా ఆర్ఎస్ హైస్కూల్‌కు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, నౌపడా జంక్షన్‌లో కోణార్క్, ఫలక్‌నుమా, పారాదీప్, హిరాఖండ్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ అప్పలరెడ్డి, లోకేష్, యోగి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎల్‌సీ గేట్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని పట్టణానికి చెందిన డాక్టర్ పూడి కిరణ్ కుమార్, బి.గాంధీ, ప్రతాప్‌రావు, ప్రమోద్ కోరారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో రైల్వే భువనేశ్వర్ చీఫ్ ఇంజినీర్ చంద్రమోహన్‌కి వినతిపత్రం అందజేశారు.

పీఏసీఎస్ భవనం ప్రారంభం

సరుబుజ్జిలి: కొత్తకోట వద్ద పీఏసీఎస్ భవనాన్ని సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమరోత్సాహం



కోటబొమ్మాళి నుంచి బైక్‌లపై విజయ చిహ్నం చూపుతూ బుల్లెట్‌పై వస్తున్న బాబాయి.. అబ్బాయి

40 కిలోమీటర్ల మేర సాగిన ర్యాలీ

టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు శ్రీకాకుళం నిర్వహించిన 'రా.. కదలిరా' పేరిట సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు వేలాది ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ శ్రీకాకుళం వరకు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కోటబొమ్మాళి క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభించిన ర్యాలీ హైవేపై 40 కిలోమీటర్ల మేర రెండు గంటల పాటు సాగింది. బాబాయ్, అబ్బాయ్ ఒకే బైక్‌పై రాగా వారిని వేలాది మంది టీడీపీ, జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు బైక్‌లపై అనుసరించారు. దారిపొడవునా అభిమానుల జయ జయ ధ్వానాలతో, బాణసంచా కాల్పులతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. - టెక్కలి

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిలిచిన సిటీ స్కాన్ సేవలు

- మూడురోజులుగా ఇబ్బందులు పడుతున్న రోగులు

టెక్కలి: జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సిటీస్కాన్ సేవలు మూడురోజులుగా నిలిచిపోయాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది నవంబరులో కూడా మూడురోజుల పాటు సిటీ స్కాన్ సేవలు నిలిచిపోగా తాజాగా శనివారం రాత్రి నుంచి సిటీ స్కాన్‌లో సాంకేతిక సమస్యలతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోజుకు 30 నుంచి 40 మంది వరకు సిటీ స్కాన్ సేవలు వినియోగించుకుంటున్న రోగులు ఒక్కసారి ఇబ్బందులకు గురయ్యారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు, సారవకోట, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం తదితర మండలాలతో పాటు ఒడిశా నుంచి కూడా రోగులు వచ్చి వైద్యుల సూచనల మేరకు సిటీస్కాన్ సేవలను పొందుతున్నారు. అయితే తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని రోగులు వాపోతున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు వద్ద ప్రస్తావించగా సంబంధిత సిటీ స్కాన్ యంత్రంలో సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిందని, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చామని, ఒకటి, రెండు రోజుల్లో వాటి సేవలు పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.



పనిచేయని సిటీ స్కాన్ మిషన్

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

వజ్రపుకొత్తూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని, దీనిలో భాగంగా మొక్కలను నాటి పరిరక్షించాలని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకులు విజయ కుమార్, తిరుపతిరావు కోరారు. సోమవారం ఉద్దానం కూర్మనాథపురంలో రోడ్డుకు ఇరువైపులా చెర్రీ మొక్కలను నాటారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మధు, రాజేశ్వరి, భాస్కర్, రమేష్, రవి, సంతోష్, పృథ్వి, అభి, వెంకటేష్, ఆకాష్, ధనరాజ్ పాల్గొన్నారు.

అర్జీలను ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలి

కలెక్టరేట్ : అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. సోమవారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో ఆయన జేసీ ఎం.నవీన్‌తో కలిసి 178 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ దొరబాబు, జడ్పీ సీఈవోడి.వేంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో మీనాక్షి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బాలకృష్ణయాదవ్

పనులు చేసినా డబ్బులివ్వడం లేదని ఫిర్యాదు

మెళియాపుట్టి: ఐటీడీఏ ద్వారా 2019లో సుమారు రూ.10 లక్షలకు సంబంధించి చేపట్టిన వాటర్‌షెడ్ పనులకు బిల్లుల చెల్లింపులో అంపురం పంచాయతీ సర్పంచ్ డి.జమ్మయ్య చర్యలు తీసుకోవడం లేదని ఇలాయిపురం, అంపురం పంచాయతీల గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం జడ్పీలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల పంచాయతీ ఖాతాలో 10 శాతం నిధులు జమయినా బిల్లులివ్వలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గట్టిగా అడిగితే అధికార పార్టీ నాయకుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారని, తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

తక్షణం హుద్‌హుద్ గృహాలు అందించాలి

పలాస: పలాస నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో, హుద్‌హుద్ ఇళ్లను ఎన్నికల షెడ్యూల్ రాకముందే లబ్ధిదారులకు అందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం జడ్పీలో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు వినతిపత్రం అందించారు. అలాగే కాశీబుగ్గ నుంచి చిన్న బడాం ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని, ప్రజలుపడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని కోరారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి మూడో తేదీన నిర్వహించనున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 4, 5 తేదీల్లో కూడా మాపప్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జిల్లాలో 1,79,984 మంది ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కలు వేసేందుకు ఏర్పాటు చేశామన్నారు. 1232 పోలియో బూత్‌లు, 50 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. 78 మొబైల్ బృందాలు, 121 సూపర్‌వైజర్ల బృందాలతో 3,12,000 డోసులు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఎం.నవీన్, డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి, డీఐవో ఈశ్వరి, డీఆర్వో ఎం.గణపతిరావు, డీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, రవాణా, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ● ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన కరపత్రాలు, పోస్టర్లను శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జేసీ ఎం.నవీన్ ఆవిష్కరించారు. ● డిగ్రీ, పీజీ చదువుతున్న ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌ట్యాప్‌లను కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ మురళి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కవిత పాల్గొన్నారు.

సరిహద్దు నేరాలు నియంత్రించాలి: కలెక్టర్

శ్రీకాకుళం క్రైం: అంతర్రాష్ట్ర సరిహద్దులైన శ్రీకాకుళం, గంజాం, గజపతి జిల్లాల రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో సమిష్టిగా సరిహద్దుల్లో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం శ్రీకాకుళం, గంజాం, గజపతి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో అక్రమ రవాణా నివారణకు తీసుకున్న చర్యలు, సారా తయారీ విక్రయాలు అరికట్టేందుకు చేపడుతున్న చర్యలపై కలెక్టర్ ఆరా తీశారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ ఆంధ్ర ఒరిశా సరిహద్దు ప్రాంతంలో ఆరు స్టాటిక్ చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఒడిశా రాష్ట్రంతో సుమారుగా 115 కిలోమీటర్లు సరిహద్దు జిల్లా కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుమల నాయుడు, ఎస్పీ డీఎస్పీ ఎ.త్రినాథ్‌రావు,సీఐ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 19 వినతులు

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ స్పందనకు 19 వినతులు వచ్చాయి. వినతులను ఎస్పీ జీఆర్ రాధిక స్వీకరించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ.. సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ్ కాజల్, డీఎస్పీ బి.విజయకుమార్ పాల్గొన్నారు.



వర్చువల్‌లో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

నేటి నుంచి టెట్

గుజరాతీపేట: జిల్లాలో వివిధ కేంద్రాల్లో ఏపీ టెట్ మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎచ్చెర్ల శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీ, శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్, నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కళాశాలల్లో ఈ పరీక్షలు మార్చి 6వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. అలాగే అయాన్ డిజిటల్, ఎస్ఎంఐటీ డిగ్రీ ఇంజినీరింగ్ కాలేజీ బరంపురంలో కూడా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెట్‌కు సంబంధించి డీఈవో కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామన్నారు. 9703148269, 799139860, 9494094904 నెంబర్లలో ఎవరైనా సంప్రదించవచ్చునన్నారు. ఈ పరీక్షకు గంట ముందు కేంద్రాలకు హాజరు కావాలని డీఈవో సూచించారు. ● **నరసన్నపేట:** స్థానికంగా కోర్ టెక్నాలజీ సెంటర్‌లో మంగళవారం నుంచి జరగనున్న టెట్ పరీక్షల ఏర్పాట్లను ఎంఈవోలు పి.దాలి నాయుడు, ఉప్పాడ శాంతారావు సోమవారం పరిశీలించారు.

పరీక్షలను పక్కాగా నిర్వహించాలి: డీఈవో

టెక్కలి: మార్చి నెలలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ పక్కాగా చేపట్టాలని, ఎటువంటి ఘటనలకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని డీఈవో కె.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఓ ప్రైవేటు కళాశాల ఆవరణలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వవద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి, ఎంఈవోలు డి.తులసీరావురెడ్డి, డి.చిన్నారావు, పరీక్షల విభాగం అధికారులు ఆలీఖాన్, డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సెక్యూరిటీ బ్యాండ్ల నిబంధనను మినహాయించాలి

ఎచ్చెర్ల: ప్రభుత్వం నిర్వహిస్తున్న వైన్‌షాపుల్లో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మేన్లకు కొత్తగా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి సెక్యూరిటీ బ్యాండ్లను తీసుకుని ఇవ్వాలన్న నిబంధనను మినహాయించాలని వారు కోరారు. ఈ మేరకు సోమ వారం ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపో డీఎం బి.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. సెక్యూరిటీ లేని ఉద్యోగాలకు సెక్యూరిటీ బాండ్లు ఎలా ఇస్తామని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎక్సైజ్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిస్సహాయత వ్యక్తంచేశారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఎం చెప్పారన్నారు.

29న పాత తాలూకా కేంద్రాల వద్ద ధర్నా

పొందూరు: సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా ఈనెల 29న పాత తాలూకాకేంద్రాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పప్పల తిరుమలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు బుధవారం చేపట్టాల్సిన చలో విజయవాడను జేఏసీ వాయిదా వేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం

కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం రైస్, ఆయిల్ మిల్లు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, శ్రీ చైతన్య రైస్ అండ్ ఆయిల్ మిల్లు వర్కర్స్ యూనియన్ కన్వీనర్ హెచ్.ఈశ్వరరావు, కో-కన్వీనర్ కె.సూరయ్య హెచ్చరించారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేసి ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు కె.కేశవరావు పాల్గొన్నారు.

ఇంజనీర్లపై ప్రభుత్వ చర్యలు అమానుషం

శ్రీకాకుళం అర్బన్: గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎస్‌డీఎఫ్, ఉపాధి పనులకు బిల్లులు చెల్లించక పోగా, కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించడంతో నాణ్యతలేని పనులు జరిగాయని ఉద్యోగులను బలిచేసేందుకు వైసీపీ ప్రభుత్వం పీఆర్ ఇంజనీర్లపై చర్యలకు ఉపక్రమించడం అమానుషమని పీఆర్ జేఏసీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్ కార్యాలయం ఎదుట పీఆర్ జేఏసీ జనరల్ సెక్రటరీ కేసీహెచ్ మహంతి నాయకత్వంలో ఎనిమిదో రోజు మధ్యాహ్న భోజనం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పోలినాయుడు, నగేష్ పట్నాయక్, రాజు, కృష్ణారావు, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి రిజర్వాయర్ పనుల పూర్తికి చర్యలు

హిరమండలం: హిరమండలం వద్ద జరుగుతున్న వంశధార రిజర్వాయర్ పనులు 96 శాతం పూర్తయ్యాయని ఎస్ఈ డోల తిరుమలరావు తెలిపారు. సోమవారం రిజర్వాయర్‌తో పాటు అను సంధానంగా చేపడుతున్న ఎత్తి పోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఆగస్టు నాటికి రిజర్వాయర్ పనులన్నింటినీ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పిల్‌వే పనులు కూడా పూర్తవుతున్నాయని, జూన్ నుంచి ఆగస్టులోగా రిజర్వాయర్‌ను జాతికి అంకితం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్య క్రమంలో వంశధార కట్టడాల విభాగం డీఈ ఎంవీరమణ, డీఈలు రవికాంత్, సురేష్ కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానంతో తీవ్ర నష్టం

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జాతీయ విద్యావిధానం-2020ని రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం టెక్కలి అంబేద్కర్ భవన్‌లో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేంద్రం తీసుకు వచ్చిన విద్యా విధానం వల్ల విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంద న్నారు. పాఠశాల స్థాయి నుంచి వర్సిటీల విద్యా విధానం తీవ్ర సంక్షోభంలోకి నెట్టవేయబడుతుందన్నారు. విద్యను కాషాయీకరించే కుట్ర జరుగుతోందన్నారు. జిల్లా నాయకులు మహేష్, సునీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సదస్సు

కవిటి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు వెల్‌నెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు, క్లబ్ సభ్యులు జె.పాపారావు విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

జలుమూరు (సారవకోట): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. గోపాలపురం గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వేణుగోపాలరావు, మట్ట గోవిందరావు, తర్ర లచ్చుము, చల్ల జనార్దనరావు, ఇప్పిలి సత్యం, చంద్రయ్య, బలగ భాస్కరరావు పాల్గొన్నారు. **జి.సిగడాం:** విజన్ గల నాయకుడు చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూనుబిల్లి కూర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు బెవర జగన్నాథ రావు అన్నారు. సోమవారం డీఆర్‌వలస, బాతువ, పెంట, దవళపేట, మెట్టవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సంతబొమ్మాళి: మర్రిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. నాటి ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం అన్నాజీరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అట్టాడ రాంప్రసాద్, రవి పాల్గొన్నారు.



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రిటైర్డ్ డీపీవో 'చమళ్ల' మృతి

హరిపురం: మందస మండలం బాలిగాం గ్రామానికి చెందిన రిటైర్డ్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) చమళ్ల ప్రకాశరావు (87) సోమవారం విశాఖలో మృతిచెందారు. విశాఖ పట్నం జిల్లాలో ఎగ్జిక్యూటివ్ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి జిల్లా పంచాయతీ అధికారిగా హైదరాబాద్‌లో పనిచేస్తూ 1995లో పదవీ విరమణ పొందారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలలో పనిచేస్తూ ప్రజలతో మమేకమై పలువురి మన్ననలు పొందారు. ఆధ్యాత్మిక చింతనతో ఆలయాన్ని నిర్మించి గ్రామంలో జీవనం సాగిస్తూ పరమపదించారు. ప్రకాశరావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలము కున్నాయి. ఈయన మృతిపట్ల పలువురు గ్రామస్థులు, బంధువులు సంతాపం తెలిపారు.



ప్రకాశరావు(ఫైల్)

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కింజరాపువానిపేట(పోలాకి): దీర్ఘాశి పంచాయతీ కింజరాపువానిపేటలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చీరాల వాస్తవ్యులు, అయోధ్య రామయంత్ర జపశక్తి తత్పరులు డా.అన్నదానం చిదంబర శాస్త్రి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో విగ్రహ ప్రతిష్ఠ కన్నుల పండువగా జరిగింది. సాయంత్రం శ్రీకాకుళానికి చెందిన నీరజా సుబ్రమణ్యం శిష్య బృందం చేసిన కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రూ.కోటితో వేణు గోపాలస్వామి ఆలయాభివృద్ధి

మెళియాపుట్టి: చారిత్రక ప్రసిద్ధి పొందిన వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి రూ.కోటితో ప్రతిపాదనలు తయారు చేసి దేవదాయశాఖ ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఈవో వాసు దేవరావు తెలిపారు. సోమవారం ఇంజనీరింగ్ అధికారులు ఆలయాన్ని సందర్శించి అంచనాలు తయారు చేశారన్నారు. ఇటీవల దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఆలయాన్ని పరిశీలించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారన్నారు. ఈ మేరకు నిధుల కోసం అంచనాలను పంపుతున్నామన్నారు. ఏఈ చందన తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న వ్యాన్.. నలుగురికి తీవ్ర గాయాలు

కశింకోట, ఫిబ్రవరి 26: అనకాపల్లి జిల్లా కశింకోట హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ రమేశ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం దిబ్బిలివీధికి చెందిన ఆరుగురు వ్యక్తులు అన్నవరం పుణ్యక్షేత్రానికి టాటా ఏస్ వ్యాన్‌లో వెళుతున్నారు. కశింకోట వచ్చే సరికి ముందు వెళుతున్న లారీ డ్రైవర్ ఆకస్మికంగా బ్రేకులు వేశాడు. దీంతో లారీ వెనుక భాగాన్ని వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అమనాన చక్రపాణి, అమనాన భాగ్యరేఖ, సకలబత్తుల పావని, అలుపాని శ్రీనివాసరావు(డ్రైవర్) తీవ్రంగా గాయపడ్డారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.



ప్రమాదానికి గురైన టాటా ఏస్

కనీస మద్దతు ధర చట్టం చేయాలి

ఎచ్చెర్ల: రైతులకు కనీస మద్దతు ధర అందించేలా చట్టం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ, జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వెలమల రమణ డిమాండ్ చేశారు. సోమవారం చిలకపాలెంలో రైతు, కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధరల చట్టం చేయాలని వారు కోరారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయా లని కోరారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికెమ్ ఎంప్లా యీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. అశోక్, వై.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రా కదలిరా సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

టీడీపీలో జోష్

● శ్రీకాకుళంలో రా కదలిరా సభ సక్సెస్ ● భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన కేడర్ ● కిటకిటలాడిన సభా ప్రాంగణం

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శ్రీకాకుళంలో సోమవారం నిర్వహించిన రా కదిలిరా సభ సక్సెస్ కావడంతో కార్యకర్తలో జోష్ నెలకొంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని మండలాల నుంచి తరలివచ్చిన వేలాది మంది తెలుగుదేశం, జనసేన పార్టీల అభిమానులు, పార్టీల కార్యకర్తలు, నాయకుల తో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. 80 అడుగుల రోడ్డులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూనరవికుమార్, శ్రీకాకుళం నియోజకవర్గం ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి నాయకత్వంలో జరిగిన రా..కదలిరా సభలో రాష్ట్రంలో సైకోపాలన పోయి సైకిల్‌పాలన రావాలని తెలుగుదేశంపార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు రాకతో పార్టీ శ్రేణులతో పాటు ప్రజల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఆయన సభాప్రాంగణానికి చేరుకోగానే ప్రజలు సైకోపోవాలి సైకిల్ రావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడారు.

(శ్రీకాకుళం అర్బన్/ క్రైం/అరసవల్లి)

తలసరి ఆదాయం కూడా తగ్గిపోయింది

శ్రీకాకుళం,(ఆంధ్రజ్యోతి): కొత్త ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నాని, మీ ఓటు విలువ తెలుసు కుని వేయాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు కోరారు. శ్రీకాకుళంలో జరిగిన రా కదలిరా సభలోమాట్లాడుతూ..'ఇప్పుడు తెలంగాణ తో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం 44 శాతం తగ్గుదలలో ఉన్నాం. ఒక్కొక్కరి తలసరి ఆదాయం రూ.85వేలు పోగొట్టుకున్నాం. సంపద సృష్టించకుండా బటన్‌నొక్కితే ఫలిత ముండదు. సంపద సృష్టించి పేదలకు పంచగలిగేది తెలుగు దేశం మాత్రమే.ఆనాడు ఆస్తిలో ఆడపిల్లలకు హక్కు కల్పించారు ఎన్టీఆర్. నేను డ్వాక్రా సంఘాలను తీసుకువచ్చా. మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చాం. కళాశాలల్లో 33 శాతం రిజ ర్వేషన్‌లు తీసుకువచ్చా. మరలా 'సూపర్‌సిక్స్' పథకాలు తీసుకు వస్తున్నాం. 19 ఏళ్ల నుంచి 58 సంవత్సరాలలోపు మహిళలకు రూ. 1500 చొప్పున బ్యాంకు ఖాతాలో వేస్తాం. ఎంతమంది పిల్లలుంటే వారి చదువుకోసం ఒక్కొక్కరికి రూ. 15వేల చొప్పున అందజేస్తాం. రాబోయే రోజుల్లో జనాభా ఎంత ఉంటే అంత సంపద. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోయారు. మన పిల్లలను బాగా చది వించుకుందాం. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసేందుకు అవకాశంకల్పిస్తాం. రైతులకు రూ. 20వేల చొప్పున ఇస్తాం. వెనుకబడిన వర్గాలకు చెందిన 140 కులాలకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ ఎన్నికల్లో ప్రాధా న్యం ఇస్తాం. కార్పొరేషన్‌లు పెట్టి ఆయా కులాలను ఆదుకుం టాం. నిన్ననే టీడీపీకి చెందిన 94 మంది, జనసేనకు చెందిన 5 మంది అభ్యర్థుల పేర్లను వెల్లడించాం. అలాగే వెనుకబడిన వర్గాలకు కూడా న్యాయం చేసి వారి రుణం తీర్చుకుంటాం. వీరి కోసం ప్రత్యేకంగా చట్టం తెస్తాం. మత్స్యకారుల సమస్యల పట్ల అధ్యయనంచేసి డిక్లరేషన్ తీసుకువస్తాం.చెత్తపన్నురద్దు చేస్తాం. రైతులకు సబ్సిడీ అందజేస్తాం. పెట్రోల్ ధరలను నియంత్రిస్తాం. ఉచితంగా ఇసుకను అందజేస్తాం'. అని తెలిపారు.

పర్యటన ఇలా సాగింది

అరసవల్లి: శ్రీకాకుళంలోని డచ్‌బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు సోమవారంమధ్యాహ్నం 3.46 నిమి షాలకు హెలీ కాఫ్టర్‌లో చంద్రబాబునాయుడు చేరుకున్నారు. అక్కడ ఆయనకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నా యుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళంఅశోక్, శ్రీకాకుళం,పాతపట్నం, నరసన్నపేట, రాజాం నియోజకవర్గాల ఇన్‌చార్జిలు గుండ లక్ష్మీదేవి, కలమట వెంక టరమణ, బగ్గు రమణమూర్తి, కోండ్రు మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, పల్సస్‌సంస్థల అధినేత గేదెల శ్రీనుబాబు, జనసేననాయకుడు దానేటి శ్రీధర్ స్వాగతం పలి కారు. అనంతరం చంద్రబాబు భారీ భద్రత నడుమ స్థానిక 80 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన సభావేదిక వద్దకు సా యంత్రం 4.34 నిమిషాలకుచేరుకున్నారు.అనంతరం సాయం త్రం 5.16 నిమిషాలకు ప్రారంభమైన చంద్రబాబు ప్రసంగంసాయంత్రం 6.16 నిమిషాలకు ముగిసింది. అనం తరం చం ద్రబాబు కారులో బయలుదేరి విశాఖ చేరుకున్నారు.

● శ్రీకాకుళంలోని 80అడుగుల రోడ్డులో జరిగిన రా...కదలిరా సభకు చేరుకున్న చంద్రబాబును నియోజకవర్గ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు గజమాలతో సత్కరించారు.

చంద్రబాబు సీఎం కావడమే ధ్యేయం

● అభిమానులతో తరలివచ్చిన గొండు శంకర్



అభిమానుల కోలాహలం నడుమ ర్యాలీ నిర్వహిస్తున్న గొండు శంకర్

టీడీపీ గెలుపే లక్ష్యంగా, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడమే ఏకైక ధ్యేయంగా అహర్నిశలు పనిచేస్తామని ఆ పార్టీ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ తెలి పారు. సోమవారం మధ్యాహ్నం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో జరిగిన రా....కదలి...రా సభకు వేలాది మంది కార్యకర్తలతో చేరుకున్నారు. చంద్రబాబు నాయుడుకు శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందించి సభావేదిక వద్దకు ఆహ్వానించారు.

చంద్రబాబును కలిసిన కలిశెట్టి

రా కదలిరా సభకు వచ్చిన చంద్రబాబునాయుడిని సభలో వేదికపై పొం దూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు కలుసుకు న్నారు. ఈసందర్భంగా దుశ్శాలువతో సత్కరించారు. అంతకుముందు వేలాది మంది కార్యకర్తలతో ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ర్యాలీగా శ్రీకాకుళం సభకు తరలివచ్చారు.



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు



చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎంజీఆర్

● వందలాది వాహనాలలో ర్యాలీగా రా.. కదలిరా... సభకు హాజరు

పాతపట్నం: రాకదలిరా కార్యక్రమానికి శ్రీకాకుళం వచ్చిన నారా చంద్రబాబునాయుడుకు పాత పట్నం నియోజకవర్గ సీనియర్ నాయకుడు మామిడి గోవిందరావు(ఎంజీఆర్) పుష్ప గుచ్ఛాన్నిచ్చి ఘనస్వాగతం పలికారు. పాతపట్నంలోని ఎంజీఆర్ క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, అనుచరులతో వందలాది వాహనాల్లో వేలాదిమందితో ర్యాలీగా రా.. కదలిరా...సభకు తరలివెళ్లారు.చంద్రబాబునాయుడుకు పుష్పగుచ్ఛాన్నిచ్చి ఆయనతో సభావేదికపైకి వెళ్లి కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెంచల్‌గూడ జైలుకు వెళ్లేందుకు జగన్ సిద్ధం

● ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలో సభలు నిర్వహిస్తున్న జగన్ రెడ్డి సిద్ధం అంటూ బజాలు ఎగరేస్తున్నారని, ఆయన దేనికి సిద్ధమో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రశ్నించారు. బాబాయిని చంపిన జగన్ ఇంకా ఎంతమందిని చంపడానికి సిద్ధమని, కల్తీ మద్యంతో మహిళల తాలిబొట్టు తెం చేందుకు సిద్ధమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్‌రెడ్డి చెంచల్ గూడ జైలుకు వెళ్లేందుకు మాత్రం ఖచ్చితంగా సిద్ధమని ఎద్దేవాచేశారు. చంద్రబాబు 99 ఎమ్మెల్యే సీట్లను ప్రెస్‌మీట్ పెట్టి ఒకటి రెండు మూడు అని చెబుతుంటే జగన్ మదిలో ఎ1, ఎ2, ఎ3, ఎ4 అనే భావన మొదలైందని విమర్శించారు.ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం దోపిడీదారులకు సీట్లు కట్టబెడుతుందని ఆరోపించారు. పది కిలోమీటర్లు రోడ్డు వేసుకోలేని మంత్రి, స్పీకర్‌గా జిల్లా చరిత్రలో నిలిచిపోతారన్నారు. వంశధార-నాగావళి, బాహుదా నదుల అనుసంధా నానికి టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 6,272 కోట్లతో జీవోను విడుదల చేస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవోను రద్దు చేసిందని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే శ్రీకాకుళం జిల్లాను ఎకనామిక్ హబ్‌గా చంద్రబాబు నాయుడు మారుస్తారని, దీంతో వలసలకు స్వస్తి పలుకుతామని ఎంపీ హామీ ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లాలో 8 ఎమ్మెల్యేలు, ఎంపీ స్థానం కైవసం చేసుకుని సిక్కోలు టీడీపీకి కంచుకోట అని నిరూపించాలని కోరారు. సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.

స్టేడియం ఎందుకు నిర్మించలేకపోయారు..?


● శ్రీకాకుళం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి



శ్రీకాకుళంలో స్టేడియం నిర్మించలేకపోయిన ఎమ్మెల్యేనంటూ 2019 ఎన్నికల్లో ర్యాలీచేసి మహిళా ఎమ్మెల్యేనని కూడా చూడకుండా రాజకీయ లబ్ధికోసం దూషించి అవమానించి ధర్మాన ప్రసాదరావు అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచినా స్టేడియం ఎందుకు నిర్మించలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని శ్రీకాకుళం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి కావొస్తున్నా, టీడీపీ హయాంలో మంజూరైన 15 కోట్ల నిధులతో స్టేడియం నిర్మా ణం ఎందుకు పూర్తిచేయలేదో సమాధానం చెప్పాలన్నారు. 33 కోట్లతో టీడీపీ హయాంలో కొత్తరోడ్డు నుంచి ఆమ దాలవలస వరకు 100 అడుగుల వెడల్పు రోడ్డు నిర్మాణానికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసి టెండర్లు పిలిచామని తెలిపారు. ధర్మాన మంత్రిగా ఉండగా ఆ రోడ్డు పనులు ఎందుకు పూర్తి చేయలేదని లక్ష్మీదేవి నిలదీశారు. ఈ రోడ్డు నిర్మాణం జరగక రోడ్డు ప్రమాదంలో 27 మంది ప్రాణాలు కోల్పోయిన వారిలో మానవత్వం మేల్కొకోకపోగా రోడ్డు పనులు చేపట్టకపోవడం మంత్రి ధర్మాన పనితీరుకు అద్దం పడుతోందన్నారు. రోడ్డు పనులు చేపట్టలేని మంత్రి స్టేడియం ఎలా నిర్మించగలరని లక్ష్మీదేవి ఎద్దేవాచేశారు. శ్రీకాకుళం ప్రజలు అంతా గమనిస్తున్నారని, రానున్న న్నికల్లో మంత్రి ధర్మానతో పాటు వైసీపీకి ఓటు హక్కుతో బుద్ధి చెప్పి సైకోను తరిమికొడతారని జోస్యం చెప్పారు.

ధర్మాన సోదరులకు ఓటు అడిగే హక్కు లేదు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్



జిల్లాలో ధర్మాన సోదరుల ఇంటి పేర్లోనే ధర్మం ఉందని, వారిద్దరూ చేసేదంతా అధర్మమేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూనరవికుమార్ విమర్శించారు. 37 కోట్లతో శ్రీకాకుళం ఆమదాలవలసరోడ్డును 100అడుగుల వెడల్పుచేసేందుకు టీడీపీ హ యాంలో శంకుస్థాపన చేశామని, కానీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ సీతారాం పది కిలోమీటర్ల రోడ్డు నిర్మించలేకపోయారని విమర్శించారు. ఆర్థిక ఉగ్రవాది జగన్‌రెడ్డి ఒక్క అవకాశమని అధికారంలోకి వచ్చి టీడీపీ హయాంలోని 100 సంక్షేమ పథకాలను రద్దు చేసిన దుర్మార్గ సీఎం జగన్మోహన్‌రెడ్డి అని ఆరోపించారు. జిల్లాలో ఇసుక,మద్యం పేరుతో దోచు కుంటున్న ధర్మాన సోదరులకు ప్రజలను ఓటు అడిగే హక్కు లేదన్నారు.రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పడం ఖాయమని తెలిపారు.

ఫ్యాన్ రెక్కలు విరుద్దాం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష



ఒక్క చాన్స్ పేరుతో నమ్మి అవకాశం ఇచ్చినందుకు ప్రజలపై చెత్త పన్నుతో మొదలు పెట్టి ఆర్థిక భారాన్ని మోపి తాను మాత్రం విలాస జీవితం గడుపుతున్న తుగ్లక్ జగన్‌ను రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. 2019 ఎన్నికల్లో ప్రజలు, టీడీపీ, జనసేన కార్యకర్తలు కలిసికట్టుగా ఫ్యాన్ రెక్కలు విరుద్ధామన్నారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించకపోగా సీఎం జగన్ పాలనలో పెట్టుబడులతోపాటు పరిశ్రమలు వెనక్కిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు.మళ్లీ టీడీపీ, జనసేన ప్రభుత్వంలోని చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

సైకో జగన్‌ను ప్రతిఘటిద్దాం


● మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ



రాష్ట్రంలో జగన్‌రెడ్డి నాయకత్వంలో విధ్వంస పాలన సాగుతోందని, అన్ని వ్యవ స్థలు, ప్రజల హక్కులను వైసీపీ ప్రభుత్వం హరించిందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ధ్వజ మెత్తారు. జిల్లాలో ఇసుక, మద్యంతోపాటు అన్ని శాఖల్లో మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి పేరుకు పోయిందని ఆరోపించారు. రాష్ట్ర సంక్షేమం కోసం 2030 విజన్‌తో సీఎంగా ఉన్న చంద్ర బాబునాయుడు నాణ్యమైన విద్యన ందిస్తూ, వినూత్నమైన సంస్కరణలతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథం వైపు నడిపించారన్నారు.33 కేసుల్లో ముద్దాయిగా ఉన్న సీఎం జగన్ నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని విమర్శించారు. సాయుధ విప్లవం చదివిన ఓటర్లు జగన్‌రెడ్డి అవినీతిని అంతమొందించేందుకు ఓటు హక్కుతో ప్రజా విప్లవానికి నాంది పలికి రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన అభ్యర్థులను గెలిపించి ఉమ్మడి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారు.

దుర్మార్గ పాలనకు చరమగీతం పాడుదాం

● మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు బగ్గు లక్ష్మణరావు



చంద్రబాబుతో రాష్ట్రం ఎంతోగానో అభివృద్ధి చెందిందని, 2019లో వైసీపీ అధికారం లోకి వచ్చిన తర్వాత అభివృద్ధి మచ్చుకైనా కానరాలేదని టీడీపీ నాయకుడు బగ్గు లక్ష్మణరావు పేర్కొన్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో జగన్‌రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. దుర్మార్గపా లనకు చరమగీతం పాడు దామని పిలుపునిచ్చారు. మళ్లీ బాబు వస్తేనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని తెలిపారు. 2024 ఎన్నికల్లో టీడీపీ- జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించి జగన్‌రెడ్డి దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం

● జనసేన ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి పిసిని చంద్రమోహన్



రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రాన్ని సైకో బారి నుంచి కాపాడుకుందామని జనసేన ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి పిసిని చంద్రమోహన్ పిలుపునిచ్చారు. దుర్మార్గ పాలనను తరిమికొట్టేందుకు టీడీపీ కార్యకర్తలతో కలిసి జనసైనికులు కలిసి పనిచేయాలని ఆయన కోరారు.

బాబుతోనే నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి: జనసేన నాయకుడు దానేటి శ్రీధర్

రాష్ట్రానికికాబోయే సీఎం చంద్రబాబునాయుడుతోనే నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యపడుతుందని జనసేన నాయకుడు దానేటి శ్రీధర్ తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన కూటమి 175 సీట్లు గెలవడం ఖాయమని చెప్పారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్న



చంద్రబాబుకు గజమాలతో సత్కరిస్తున్న శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు



శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఏర్పాటుచేసిన సభలో జనసందోహం



చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద సిద్ధంగా ఉన్న అచ్చెన్నాయుడు, నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నాయకులు